

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 247 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 17-6-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## మెట్రోపై అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించండి - రెండో దశ మెట్రో విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నాం - కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ లేఖ




**హైదరాబాద్, జూన్ 16 (వన్‌నేషన్):** "మెట్రో మొదటి దశకు ఐఆర్ఎఫ్‌సీ రుణం; రెండో దశకు అనుమతుల విషయంలో మరింత జాప్యం చేయవద్దు. వీటిపై చర్చించేందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వెంటనే సమావేశం ఏర్పాటు చేయించండి. సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలు, అధికారులతో కలిసి ఆ సమావేశానికి హాజరై అన్ని వివరణలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా" అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ నుంచి కేంద్రంలో సీనియర్ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఈ విషయంలో బాధ్యత తీసుకుని ఐఆర్ఎఫ‌సీ ద్వారా మంజూరైన రుణం విడుదలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మెట్రో ఫేజ్-2ను కేంద్రం-రాష్ట్రం 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలని కోరుతున్నామని, ఒకవేళ అనుమతులు ఆలస్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులు, సంస్థాగత రుణాల ద్వారా ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన ముందస్తు అనుమతులను ఆలస్యం లేకుండా కేంద్రం నుంచి ఇప్పించాలని కోరారు. "హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 మూడు కారిడార్లలో 69 కిలోమీటర్ల మేర ప్రయాణికులకు సేవలందిస్తోంది. పెరిగిన జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. మొత్తం ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మార్గమిది.

సుమారు రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలు ఇచ్చింది. అయితే, ఫేజ్-1 ప్రైవేటు నిర్వహణలో ఉండటం, ఫేజ్-2 వేరే సంస్థాగత విధానంలో అమలు చేయనుండడంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మకంగా స్వీకరించింది. మొత్తం మెట్రో వ్యవస్థ ఒకే నెట్‌వర్క్‌లో నడిచేందుకు వీలుగా ఫేజ్-1ను కొనుగోలు చేసే అసాధారణ నిర్ణయం తీసుకున్నాం. ఫేజ్-1 స్వాధీన ప్రక్రియలో ఈక్విటీ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15,000 కోట్ల లావాదేవీలున్నాయి.

## - నెల రోజులు బస చేయండి: సీఎం - సింగపూర్‌లో పారిశ్రామికవేత్తలకు బాబు పిలుపు - సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ప్రసంగం




**అమరావతి, జూన్ 16 (వన్‌నేషన్):** సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు సత్సం బంధాలున్నా యని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మూడు దశాబ్దాల కిందటి నుంచే ఆ దేశంతో కలసి పనిచేస్తున్నామని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఓ టౌన్‌షి?పను కూడా నిర్మించామని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్‌ప్లాన్‌ను ఇచ్చిందన్నారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఒక అద్భుతమైన ప్రణాళికను రూపొందించిందని చెప్పారు. అమరావతితో పాటు ఇతర నగరాల అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వంతో కలసి పనిచేస్తున్నామని తెలిపారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని సీఎం అన్నారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లను మార్చుకోవాలని ఆ దేశ పారిశ్రామిక వాణిజ్య, కమ్యూనికేషన్‌రంగ దిగ్గజ సంస్థలను కోరారు. సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు రెండోరోజైన మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు పారిశ్రామికవేత్తలకు వివరించారు. భూమి కేటాయింపులు, పారిశ్రామిక అనుమతులు వేగంగా ఇస్తున్నామని చెప్పారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్దేశించుకుంటున్నామని చంద్రబాబు వెల్లడించారు. 2028 నాటికి ఆర్సెల్లార్ మిట్టల్ ఉత్పత్తిని ప్రారంభించి రాష్ట్రం నుంచి ఎగుమతులు చేపడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. వైజాగ్‌లో ఏర్పాటయ్యే గూగుల్ డేటా సెంటర్‌కు గ్రీన్‌ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. గూగుల్‌తో పాటు పది గిగావాట్ల సామర్థ్యంతో కూడిన డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని వెల్లడించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ. 7 వేల కోట్లతో శ్రీసిటీలో ఎలక్ట్రిక్ గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించబోతోందని చెప్పారు.




## జీ7 సదస్సు.. ముగ్గురు భారతీయ నావికుల మృతిని ప్రస్తావించిన ప్రధాని మోదీ..

**న్యూఢిల్లీ, జూన్ 16 (వన్‌నేషన్):** ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. అమెరికా దాడుల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ నీటిలో మునిగి చనిపోయారు. ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరుగుతున్న జీ7 (+7) సదస్సులో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ముగ్గురు భారతీయ నావికుల మృతి గురించి ప్రస్తావించారు. అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై జరిగిన క్షిపణి దాడులలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలోనే ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పటంలో సాధించిన పురోగతిని మేము స్వాగతిస్తున్నాము. ఇరాన్, అమెరికా దేశాల మధ్య ఘర్షణ ఆ ప్రాంతంలోని మా మిత్రదేశాలలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించింది. ఒమన్ తీర ప్రాంతంలో నౌకపై జరిగిన దాడిలో పలువురు భారతీయ పౌరులు తమ ప్రాణాలను కోల్పోయారు. ప్రపంచ సముద్ర వాణిజ్యం ద్వారా దేశాలకు వారధులుగా నిలిచే నావికుల భద్రత మన బాధ్యత. సముద్ర మార్గాలు సురక్షితంగా ఉండేలా.. ఎలాంటి భయాందోళనలు లేకుండా నావికులు విధులు నిర్వహించుకునేలా తగిన చర్యలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది' అని అన్నారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ దాదాపు 16 నెలల తర్వాత జీ7 సదస్సులో ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుని, కొద్దిసేపు మాట్లాడుకున్నారు. సదస్సులో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. బుధవారం ఈ ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు.

## రేవంత్‌వి దిగజారుడు రాజకీయాలు

### - సమస్యను చర్చలతో పరిష్కరించుకోవచ్చు - ప్రాజెక్టులను అడ్డుకునే ఆలోచన లేదు - మా చిత్తశుద్ధికి కాంగ్రెస్ సర్టిఫికెట్లు అవసరం లేదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, జూన్ 16 (వన్‌నేషన్):** హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ స్వాధీనం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ ఎఫ్‌సీ) నుంచి రుణం రాకుండా తాను అడ్డుకున్నా నని సీఎం రేవంత్ ఆరోపిం చడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి తగదని అన్నారు. రేవంత్ ఆరోపణల నేపథ్యంలో ఈ విషయమై తాను కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా.. మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక, సాంకేతిక అంశాల్లో తెలంగాణ ఇచ్చిన ప్రతిపాదనల వల్లే కొంత ఆలస్యం జరుగుతోందని చెప్పినట్లు వెల్లడించారు. ఐఆర్ఎఫ్‌సీతో రాష్ట్ర ప్రభుత్వానికి కుదిరిన ఒప్పందం ప్రకారం మెట్రో ద్వారా వచ్చే ఆదాయాన్ని అప్పు తీర్చేందుకే వినియోగించాల్సి ఉందని తెలిపారు. అయితే, ముందుగా మెట్రో నిర్వహణ, కార్యాకలపాల కోసం ఖర్చు పెట్టాలని, మిగిలిన ఆదాయాన్ని ఫేజ్ 2, ఐఆర్ఎఫ్‌సీ రుణాల కోసం చెల్లించాలని ఖట్టర్ ప్రతిపాదించగా.. సీఎం రేవంత్ అంగీకరించలేదని తెలిపారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో
కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై
అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని
అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.





9948222240

# స్వచ్ఛమైన తాగునీరుని అందించాలి : సిపిఎం




ఎమ్మిగనూరు, జూన్ 16 (వన్ నేషన్): ప్రజలకు ప్రాణాధారమైన త్రాగునీరు కలుషితమై సరఫరా కావడం అత్యంత ఆందోళనకరమైన విషయం అన్ని సిపిఎం ఎమ్మిగనూరు పట్టణ కమిటీ సభ్యులు ఏ సురేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్సీ కాలనీలో ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఇళ్లకు వస్తున్న నీరు మట్టి, మురుగు కలిసినట్లుగా పసుపు–గోధుమ రంగులో వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగడానికి, వంటకు, చిన్నపిల్లల అవసరాలకు కూడా ఈ నీరు పనికిరాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే వేసవి కాలంలో తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ఇప్పుడు కలుషిత నీటి సరఫరా కారణంగా ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. ఈ నీటిని వినియోగించడం వల్ల విరేచనాలు, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు మరియు ఇతర అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎక్కువగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది.

మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించి పైపులైన్లలో లీకేజీలు, మురుగు నీటి కలయిక వంటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. నీటి నమూనాలను పరీక్షించి ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలి. అలాగే ప్రతి కాలనీలో స్వచ్ఛమైన త్రాగునీటిని అందించే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిపిఎం హెచ్చరిస్తోంది.

# అమర్నాథ్ గౌడ్‌కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూర్ జూన్ 16 MD యూసుఫ్ (వన్ నేషన్) – బాపట్ల జిల్లాకు చెందిన 10వ తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ దారుణ హత్యకు గురై జూన్ 16 నాటికి మూడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి గారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.దఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ అమర్నాథ్ గౌడ్ ఘటన రాష్ట్ర రాజకీయ చరిత్రలో మరచిపోలేని విషాదకర సంఘటనగా నిలిచిపోయిందన్నారు. పదో తరగతి చదువుతున్న అమాయక విద్యార్థిని పెట్రోల్ పోసి సజీవదహనం చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అమర్నాథ్ గౌడ్ కుటుంబం ఇప్పటికీ ఆ బాధ నుంచి కోలుకోలేకపోతుంటే, ఆ ఘటనకు బాధ్యులైన వారు ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా వ్యవహరించడం మరింత బాధాకరమని అన్నారు.



ఇలాంటి అమానుష ఘటనలు సమాజానికి చెడు సంకేతాలని, ప్రజాస్వామ్యంలో హింసకు ఎలాంటి స్థానం లేదని పేర్కొన్నారు. అమర్నాథ్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలకు బీఆర్ఎస్ నాయకుల చేయూత

**ఆరుగురు విద్యావాలంటీర్ల నియామకం...**

మేడిపల్లి / జూన్ 16 / వన్ నేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముందుకొచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలకు బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు అండగా నిలిచారు.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మరియు పార్టీ నాయకులతో కలిసి మేడిపల్లి, పీర్జాదిగూడ హైస్కూళ్లను మరియు పర్వతాపూర్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు పూర్తి స్థాయిలో అడ్మిషన్లు వస్తున్నప్పటికీ, మంజూరైన పోస్టులు లేని కారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం జరగడం లేదని ప్రధానోపాధ్యాయులు మాజీ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిస్థితిపై వెంటనే స్పందించిన మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మూడు పాఠశాలల్లో ఆరుగురు విద్యావాలంటీర్లను నియమించి, వారికి ప్రతి నెలా వేతనం అందేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా కిచెన్ షెడ్ నిర్మాణంతో పాటు, పీర్జాదిగూడ



మరియు పర్వతాపూర్ పాఠశాలల్లో కిచెన్ షెడ్ల మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఈ బాధ్యతను మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్ స్వచ్ఛందంగా స్వీకరించారు. బీఆర్ఎస్ నాయకుల ఈ ఔదార్యంపై ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో సకల వసతులు కల్పించాలనే నాయకుల సంకల్పం ఆదర్శనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డితో పాటు యువజన, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, పలువురు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాధనం వృధా

## -నర్సరీకి రక్షణ కరువు -మేడ్చల్ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు రేపన్ లక్ష్మణ్





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జవహర్‌నగర్, జూన్ 16 (వన్ నేషన్ న్యూస్): ప్రభుత్వ నిధులు ఎలా వృధా అవుతాయో తెలుసుకోవాలంటే జవహర్‌నగర్, కీసర సర్కిల్ డివిజన్–2 లోని సర్వే నంబర్ 158 లో ఉన్న నర్సరీని చూడాల్సిందేనని మేడ్చల్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రేపన్ లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. గత సంవత్సరం ఎంతో హంగూ ఆర్భాటాలతో 10 గుంటల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఈ నర్సరీ, ఇప్పుడు మొక్కల స్మశాన వాటికలా మారిందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. నర్సరీలో మొక్కలకు నీళ్లు పోయడానికి బోరు బావి కూడా వేశారు. కానీ, చిత్రమేమిటంటే అక్కడ మొక్కలకు నీళ్లు పోసే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా ప్రస్తుతం ఆ స్థలంలో చూస్తే ఒక్క పచ్చటి ఆకు కూడా కనిపించకుండా, మొక్కలన్నీ పూర్తిగా ఎండిపోయి చచ్చిపోయాయి. కనీస మెయింటెనెన్స్ కూడా చేయకుండా మొక్కలను తెచ్చి అలా విసిరిపారేయడంపై లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రస్తుతం జూన్ నెల వచ్చింది. జనం మొక్కలు నాటడానికి సిద్ధమవుతుంటే, ఇక్కడ ప్రభుత్వ నర్సరీలోనే మొక్కలన్నీ ఎండిపోయాయి. ఇదంతా చూస్తుంటే మొక్కలు పెంచడానికి నర్సరీ పెట్టినట్టు లేదు... సర్వే నంబర్ 158 లోని విలువైన ప్రభుత్వ స్థలాన్ని భూకబ్జాదారులకు దోచిపెట్టడానికే కావాలనే నర్సరీని ఎండబెట్టినట్టు కనిపిస్తోంది."రేపన్ లక్ష్మణ్, తెలుగు యువత అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం.

**ప్రజాధనం 'స్వాహా'.. తక్షణమే పునరుద్ధరించాలి!**

లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఇలా నర్సరీ పేరుతో దుర్వినియోగం చేయడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మత్తు వీడి, సర్వే నంబర్ 158 లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల బారి నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎండిపోయిన నర్సరీని పునరుద్ధరించి, కొత్త మొక్కలను నాటాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రేపన్ లక్ష్మణ్ హెచ్చరించారు.

# భారత్ లో ఇంధనం ధరలు తగ్గించాలి

## సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు- ధనుంజయ నాయుడు



సూర్యాపేట జిల్లా ప్రతినిధి యాతాకుల మధుసూదన్ జూన్ 16 (వన్ నేషన్) : అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం కుదరడంతో యుద్ధం విరమణ ప్రకటించడం వల్ల అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గాయని అందువల్ల తక్షణమే దేశములో పెట్రోలు గ్యాస్ డీజిల్ ధరలు తగ్గించి పేద ప్రజలపై మోపిన భారాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మంగళవారం సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల కేంద్రంలో విడుదల చేసిన పత్రిక ప్రకటనలో... యుద్ధం పేరుతో లేదా ఆ వంకతో దేశంలో పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెంచి కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం పైశాచిక ఆనందం అనుభవించిందని ఇప్పుడు శాంతి ఒప్పందం అమలులోకి రావడం వల్ల క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గాయని మార్చిలో బ్యారల్ ధర 118 డాలర్లు ఉండగా నేడు 84 డాలర్లకు పడిపోయిందని అంటే దాదాపు 30 శాతం ధర తగ్గిందని ఇప్పుడు గాని కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం పెంచిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచకపోతే ఆ ప్రభుత్వం పేద మధ్యతరగతి వర్గాలకు తీరని ద్రోహం చేసిన ప్రభుత్వంగా చరిత్రలో మిగిలిపోతుందని 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకొని ఈనాటి వరకు రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా వ్యవసాయాన్ని ధ్వంసం చేసేందుకు 100 రకాల చర్యలు చేపట్టి భంగపడి దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాసి నల్ల చట్టాలను వాపస్ తీసుకున్న విషయాన్ని దేశ ప్రజలు ఇంకా మరిచిపోలేదని రైతులకు ద్రోహం వల్లనే 400 సీట్లు రావాల్సిన బిజెపికి 240 సీట్లు మాత్రమే వచ్చాయని భవిష్యత్తులో మరిన్ని సీట్లు తగ్గి ఆ ప్రభుత్వశీ అధికార కోల్పోతేనే ఈ దేశంలో సామాన్యుడి మనుగడ సాధ్యమవుతుందని అన్ని వర్గాల ప్రజలు బిజెపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న విషయాన్ని ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీకి వస్తున్న స్పందన వల్ల అర్థమవుతుందని రాజస్థాన్లో ఒక రాజకీయ పార్టీ వాళ్ళు కాక్రోచ్ కార్యకర్తలపై నాయకులపై దాడి చేస్తే తిరిగి వాళ్ళు ప్రతిదాడి చేస్తే రోడ్ల వెంట పరుగులు పెట్టుకుంటూ వెళ్లారని ఇది దేశ ప్రజలు గమనిస్తున్నారని ఇప్పటికైనా కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసిన విధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించి నైతిక విలువలు కాపాడుకోవాలని ఆయన హితవు పలికారు.

# మతసామరస్య ప్రేమ అనురాగాలకు హైదరాబాద్ నిలయం: డీజీపీ ఆనంద్

చార్మినార్, జూన్ 16 (వన్ నేషన్) : మతసామరస్య ప్రేమ అనురాగాలకు నిలయమని తెలంగాణ డిజిపి సీవీ. ఆనంద్ అన్నారు.మంగళవారం సాలర్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని సాలార్ జంగ్ మ్యూజియం సాలర్ జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో గజల్ సంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్న సంస్కృతులకు నిలయమైన మనసు పూర్తిగా పలకరించుకునే నగరంగా ప్రేమ అనురాగాల సంపదకు నిలయంగా హైదరాబాద్ కు ప్రత్యేక పేరు గుర్తింపు ఉందని అన్నారు. సంస్కృతిక కార్యక్రమంలో సీవీ.లలిత ఆనంద్ దమాదం మస్తు కలందర్ పాటను పాడి అందరిని ఆశ్చర్యపరిచారు. నాలుగో గజిల్స్? పాటలను అద్భుతంగా పాడి అందరి మనలను పొందారు.

# జూలై 2న రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల భూ పోరాట కార్యక్రమం

## ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లు, కో-ఆర్డినేటర్ల నియామకం

**హైదరాబాద్, జూన్ 16 (వన్ నేషన్ ప్రతినిధి):** తెలంగాణ ఉద్యమకారుల భూ హక్కుల సాధన కోసం జూలై 2న రాష్ట్రవ్యాప్తంగా "ఉద్యమకారుల భూ పోరాట కార్యక్రమం" నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లు, కో-ఆర్డినేటర్లను నియమించారు.

జిల్లాల వారీగా ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలను సమన్వయం చేస్తూ భూ హక్కుల కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో GHMCతో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలకు ప్రత్యేక బాధ్యులను నియమించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కోరె సాయిరాం, సాజిదా సికందర్‌లను ఇన్‌చార్జ్‌లుగా నియమించగా, ఇతర జిల్లాలకు కూడా ఆయా ప్రాంతాల నాయకులకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమ విజయవంతానికి అన్ని ప్రజా సంఘాలు, ఉద్యమకారులు, భూ హక్కుల కోసం పోరాడుతున్న వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు భూ హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో ఈ భూ పోరాట కార్యక్రమం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జూలై 2న జరిగే ఈ కార్యక్రమం ద్వారా ఉద్యమకారుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# సనత్ నగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కోటా నీలిమను దూషించిన ఇద్దరు వ్యక్తులపై కేసు

**ఎస్సార్ నగర్, జూన్ 16 (వన్ నేషన్ ప్రతినిధి):** లావాదేవీల విషయంలో వచ్చిన గొడవ కాస్త పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు దాకా వెళ్ళిన సంఘటన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్ళితే టంగుటూరి గంగాధర్ గుప్తా అనే వ్యక్తి సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ కోటా నీలిమను ఫోన్లో అసభ్యంగా దూషించారని సురేష్ గౌడ్, రాజా అనే వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఫిర్యాదులో పేర్కొన్నట్టు దాదాపు కోటి యాభై లక్షల లావా దేవి విషయంలో టంగుటూరి గంగాధర్ గుప్తా ను సురేష్ గౌడ్, రాజా అనే వ్యక్తులు చాలా రోజుల నుండి వేధిస్తూ చంపేస్తామంటూ బెదిరిస్తున్నరని తెలుస్తుంది. ఇదే విషయంలో కాంగ్రెస్ నాయకురాలు కోటా నీలిమాను అసభ్యంగా దూషించిన ఆడియో రికార్డు పోలీస్ స్టేషన్లో సమర్పించినట్టు తెలుస్తుంది. ఈ మేరకు ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# ఈనెల 21వ తేదీన వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక

**మలక్పేట్/వన్ నేషన్ :** విశ్వ లింగాయత్ మ్యారేజ్ బ్యూరో మలక్పేట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మలక్పేట్ లోని శుభకరి ఏసి ఫంక్షన్ హాల్ లో వీర శైవ లింగాయత్ /జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక ఈనెల 21వ తేదీ నాడు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పసారం శ్రీనివాస్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి తమ బ్యూరో ద్వారా ఎంతోమంది వధూవరులకు వివాహం జరిపించినట్లు తెలిపారు. అయితే ఈసారి డాక్టర్, ఇంజనీర్ అండ్ ఎన్ఆర్ఐ, డిగ్రీకి పైగా చదువుకున్న వధూవరులు ఈ పరిచయ వేదికలో పాల్గొనాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఆఖరి తేదీ 20వ తేదీ అని, అంతలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుందని అన్నారు. ప్రవేశ రుసుము కేవలం 2000 రూపాయలు మాత్రమే ఉంటుందని తెలియజేశారు. కావున ఈ చక్కటి అవకాశాన్ని వధూవరులు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు www. vishwa lingayat marriage.comకు లాగిన్ అవ్వచ్చని అన్నారు. ఫోన్ ద్వారా అయితే 9246359842, 9949474849 నెంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.



# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ

**ఎమ్మిగనూరు జూన్ 16 డి కాసిం (వన్ నేషన్ ప్రతినిధి):** ఈనెల 24వ తేదీన బుధవారం సీఎం చంద్రబాబు నాయుడు మండలంలోని జొన్నగిరి-పగిడిరాయి గ్రామాల సమీపంలో నెలకొల్పిన అతిపెద్ద జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ కంపెనీని సందర్శిస్తున్న పర్యటన నేపథ్యంలో సీఎం పర్యటనకు సంబంధించి ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం (కర్నూల్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ) డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ కంపెనీని పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న సీఎం భద్రత ఏర్పాట్లను హెలిప్యాడ్ దిగే ప్రాంతాన్ని సభా స్థలాన్ని పరిశీలించి తనిఖీ చేశారు. అనంతరం అక్కడే ఉన్న డీఎస్పీ వెంకటరామయ్యను బందోబస్తు వివరాలను భద్రత ఏర్పాట్లను రూట్ మ్యాప్ వంటి వాటిని అడిగి





తెలుసుకున్నారు. సీఎం పర్యటనలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని భద్రత ఏర్పాట్లలో లోటుపాట్లు రాకూడదని పోలీసులకు సూచించారు. అనంతరం జిఒ మైసూర్ గోల్డ్ కంపెనీ ప్రతినిధులతో కలిసి అక్కడున్న పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరిశీలించి మరిన్ని వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ గోల్డ్ మైనింగ్ కంపెనీని సందర్శించేందుకు సీఎం ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన నేపథ్యంలో గోల్డ్ మైనింగ్ ప్రతినిధులు స్థానిక పోలీసు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో గోల్డ్ మైనింగ్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ, పీఆర్ఓ రాజేష్ అలాగే పత్తికొండ పోలీస్ సర్కిల్ రూరల్ సీఐ పులిశేఖర్, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మైనారిటీల ఓట్లపై ఉన్న శ్రద్ధ వారి ప్రాంతాల అభివృద్ధిపై లేదు: శ్రీరాములు అందెల

**బాలాపూర్, జూన్ 16 (వన్ నేషన్):** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న బడంగ్‌పేట్ మరియు బాలాపూర్ డివిజన్లలోని ది ప్రైడ్, మెగా డ్రీమ్ సిటీ, షరీఫ్‌నగర్, ద్వారకానగర్, డ్రీమ్ లేక్ సిటీ తదితర కాలనీలలో మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ప్రాంతాల్లో ఎన్నో






సంవత్సరాలుగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల సమస్యలను శ్రీరాములు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ది ప్రైడ్ కాలనీలో సరైన డ్రైనేజీ అవుట్‌లెట్ లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అదేవిధంగా పలు కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉండటం, విద్యుత్ స్తంభాలు లేకపోవడం, వీధి దీపాల కొరత, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, "హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ కాలనీలలో ఇప్పటికీ డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం బాధాకరమని, ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మైనారిటీల ఓట్లు కోరుతాయి కానీ వారి ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్నాయి అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఎటువంటి వివక్ష లేకుండా ప్రతి కాలనీకి సమాన న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రావుల మల్లేష్, కొంతం మురళీధర్ రెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు జోరాల ప్రభాకర్, శ్రీశైలం, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు గుండె నాగార్జున, క్యారగారి అరవింద్, బీజేవైఎం నాయకులు కిరణ్ రాజ్, మంగపతి నాయక్ మోతిలాల్ నాయక్, యాదిరెడ్డి, మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



**హైదరాబాద్, జూన్ 16 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ గారితో మర్యాదపూర్వ కలిసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దొంతి వినోద్ కుమార్ గౌడ్



## అవన్నీ పుకార్లేనంటూ కామెంట్

బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీ తన కుటుంబ నిర్మాణ సంస్థ పూజా ఎంటర్‌టైన్‌మెంట్‌పై వస్తున్న లీగల్ వివాదాల వార్తలకు స్పష్టత ఇచ్చారు. ప్రముఖ మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ తమ సంస్థపై, అలాగే తన తండ్రి వాషు భగ్నానీపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతోందంటూ మీడియాలో వస్తున్న కథనాలను ఆయన పూర్తిగా ఖండించారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన అధికారిక ప్రకటనలో ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపారు. గత కొద్ది రోజులుగా పీవీఆర్ ఐనాక్స్ మరియు పూజా ఎంటర్‌టైన్‌మెంట్ మధ్య ఆర్థిక వివాదం నడుస్తోందని వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా 'మిషన్ రాణిగంజ్', 'గణపత్', 'బడే మియాన్ ఛోటే మియాన్' చిత్రాల థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఒప్పందాల విషయంలో భారీ బకాయిలు ఉన్నాయని, దాదాపు రూ.50 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలు పెండింగ్‌లో ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఈ వివాద పరిష్కారం కోసం ముంబైలోని కొన్ని విలువైన ఆస్తుల విషయంలో కూడా చర్చలు జరిగాయని, సమస్య పరిష్కారం కాకపోతే కోర్టు వరకు వెళ్లే అవకాశం ఉందని కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ కూడా ఖండించింది. భగ్నానీ కుటుంబంతో తమకు ఎన్నో సంవత్సరాలుగా సత్సంబంధాలు ఉన్నాయని సంస్థ స్పష్టం చేసింది. మీడియాలో వస్తున్న కథనాలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని పేర్కొంది. వ్యాపార పరమైన అంశాలు పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకునే విషయాలని, వాటిని బహిరంగంగా చర్చించాల్సిన అవసరం లేదని తెలిపింది. అలాగే ఈ వ్యవహారాలను జాకీ భగ్నాని ఎంతో వృత్తిపరమైన నిబద్ధతతో నిర్వహిస్తున్నారని ప్రశంసించింది.

## మెగా మూవీ ఆ సినిమాకు ప్రీక్వెలా?



హాలీవుడ్ 'యూనివర్స్' సంస్కృతి నిదానంగా భారతీయ సినిమాను కూడా ఆవహిస్తున్నది. ఓ గొలుసుకట్టులా కథకూ కథకూ లింకులిస్తూ, క్యారెక్టర్లను కలుపుతూ ఓ గమ్మత్తైన ప్రపంచాన్ని సృష్టించేందుకు ఉత్సాహాన్ని చూపిస్తున్నారు నేటి దర్శకులు. కార్తీ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'ఖైదీ' చిత్రం దక్షిణాదిన ఈ ధోరణికి నాంది పలికింది. ఇప్పుడైతే ఈ ధోరణి సర్వసాధారణం. ప్రస్తుతం నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల 'ది ప్యారడైజ్' సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత ఆయన చిరంజీవితో సినిమా చేయబోతున్నారు. విశేషమేమిటంటే.. 'ది ప్యారడైజ్' కథకూ, చిరంజీవితో చేయబోయే కథకు ఒక బలమైన లింక్ ఉంటుందట. ఈ లింక్ 'ప్యారడైజ్' క్లైమాక్స్‌లో రివీల్ అవుతుందట. చిరంజీవి ఈ సినిమాలో నేరుగా కనిపించకపోయినా.. ఆయన పాత్రకు సంబంధించిన బలమైన లీడ్ మాత్రం 'ప్యారడైజ్' ముగింపులో ఉంటుందని తెలుస్తున్నది. ఓ విధంగా 'ది ప్యారడైజ్'కి ప్రీక్వెల్‌గా చిరంజీవి సినిమా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం ఈ వార్త ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రక్తపాతాన్ని కూడా స్టైలిష్‌గా చూపించడం దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రత్యేకత. నాని 'ప్యారడైజ్'లో పాత్రలు, సంభాషణలు చాలా బోల్డ్‌గా ఉంటాయని ప్రచార చిత్రాలు చెబుతున్నాయి. ఈ బోల్డ్‌నెస్, ఈ వయొలెంట్ ఎఫెక్ట్ చిరంజీవి సినిమాలోనూ కంటిన్యూ అవుతుందని తెలుస్తున్నది. మరి ఈ వార్తలో నిజం ఎంతవుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

## రణ్‌వీర్‌పై 'నిషేధం' ఎత్తివేత

కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన రణ్‌వీర్ సింగ్ 'డాన్ 3' అంశం ఓ కొలిక్కి రానుంది. ఆయనపై విధించిన నాన్ కో-ఆపరేషన్ ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' బుధవారం వెల్లడించింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు బీఎన్ తివారీ ఓ ప్రకటనను విడుదల చేశారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రణ్‌వీర్ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ'కి లీగల్ నోటీసులు పంపిన అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహించిన సంస్థ నిషేధాన్ని తొలగిస్తున్నట్లు తెలిపింది.



Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ,** RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**